ఓయూ విద్యార్థుల కోసం మూడు బస్సులను విరాళంగా ఇచ్చిన ఎస్బీఐ

❖ సామాజిక, విద్యా వికాసం కోసం బాధ్యతగా ముందుకొచ్చిన ఎస్బీఐని అభినందించిన ఓయూ వీసీ

దశ, ఓయూ: ఓయూ క్యాంపస్ సహా విద్యార్థుల రవాణా అవసరాల కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడు బస్సులను విరాళంగా అందజేసింది. ఈ మేరకు బస్సుల తాళాలలను ఎస్బిఐ అధికారులు ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం కు అందజేశారు. సుమారు కోటి రూపాయల విలువైన ఈ విరాళం విశ్వవిద్యాలయ రవాణా సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరచనుంది. రెండు సాధారణ బస్సులతో పాటు ఓ ఏసీ బస్సు కూడా ఎస్బీఐ అధికారులు ఓయూ కు అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ...ఓయూ విద్యార్థుల పట్ల భారతీయ స్టేట్ బ్యాంక్ అంకిత భావాన్ని ప్రశంసించారు. కోటి రూపాయల వ్యయంతో ఇచ్చిన మూడు బస్సులు కేవలం రవాణా సౌకర్యాన్ని మెరుగు పరచటమే కాకుండా....విద్యార్థుల విద్యా ప్రయాణానికి వెన్నుదన్నుగా నిలుస్తుందని కొనియాడారు. ప్రతిభకు నిలయమైన ఉస్మానియా వంటి విశ్వవిద్యాలయానికి,దేశంలోని అతిపెద్ద బ్యాంక్ అండగా నిలవడం భావితరాల నిర్మాణానికి ఎంతో తోడ్పడుతుందని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఈ సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ ప్రధాన అధికారి ఎస్.రాధాకృష్ణన్ మాట్లాడుతూ 219 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన స్టేట్ బ్యాంక్, 109 ఏళ్ల అద్భుత విద్యా వారసత్వం కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం కలిసి పనిచేయటం చారిత్రాత్మకమని అన్నారు. ఈ అవకాశం తమకు దక్కిన గొప్ప గౌరవంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెంద్ర కుమార్ నాయక్, ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ సి. కాశీం... ఎస్బీఐ అధికారులు పంకజ్ ప్రియదర్శి, రోహిత్ కుమార్, కొండ రవి శేఖర్, తంగి గణపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారతీయ విద్యతోనే వికసిత్

❖ భారత్ : భారతీయ శిక్షణ మండలి ఆర్గనైజింగ్ సెక్రటరీ బి ఆర్ శంకరానంద

❖ యువశక్తిని ఉపాధి దిశగా తీసుకుపోతున్నాం: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టా రెడ్డి

దశ, ఓయూ : ఓయూలో జరిగిన బి ఎస్ ఎం 57వ స్థాపన దినోత్సవం మెకాలే విద్యా విధానాన్ని పారదోలి భారతీయ విద్యా విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని భారతీయ శిక్షణ మండలి ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ బిఆర్ శంకరానంద్ పేర్కొన్నారు. భారతీయ శిక్షణ మండలి 57వ ఫౌండేషన్ డే ని శనివారం ఉస్మానియా యూనివర్సిటీ లోని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన బి ఎస్ ఎం అఖిలభారత ఆర్గనైజింగ్ సెక్రటరీ బిఆర్ శంకరానందు మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యం భారతీయ విద్యతోనే సాధ్యమని ఇందుకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టం ద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు భారతీయ శిక్షణ మండలి పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఎంతో యువశక్తి ఉందని దీనిని మానవ వనరులుగా మార్చుకున్నప్పుడు భారత్ బలం వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులను విస్తృతమైన ఉపాధి అవకాశాలు పొందేలా కృషి చేస్తూ తెలంగాణ రైజింగ్ కు పాటుపడుతున్నామన్నారు. ఇందుకు సిలబస్ మార్చడంతో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి బి ఎస్ ఎం తెలంగాణ ప్రాంత అధ్యక్షులు ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ, సెక్రటరీ ప్రొఫెసర్ ఉమా, తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి దేవరాజ్ తోపాటు బి ఎస్ ఎం కార్యవర్గ సభ్యులు, వివిధ పరిశోధన సంస్థలు, యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు ప్రభుత్వ కుట్ర

❖ ABVP రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

దశ ఓయూ: పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతవిద్యను ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో తీసుకొచ్చిన "ఫీజు రీయింబర్స్మెంట్" పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్‌రెడ్డిప్రభుత్వంకుట్రపన్నుతున్నదని,దీనిని ABVP తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ABVP రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఓయూ శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు గౌరవ హైకోర్టును ఆశ్రయించినప్పుడు,ప్రభుత్వం ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని గౌరవ హైకోర్టు పదే పదే కోరినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయని కారణంగానే "విద్యార్థుల దగ్గరనుండే ఫీజులు వసూలు చేసుకోవచ్చని గౌరవ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని,ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం ఈ చర్యకు ఒడిగట్టిందని, ఇది రీయింబర్స్ మెంట్ పథకాన్ని బొంద పెట్టడంలో భాగమే అని అన్నారు.ఈ స్కీమ్ ద్వారా లక్షల మంది పేద వర్గాల పిల్లలు ఇంజనీరింగ్,మెడిసిన్,ఫార్మసీ, లా లాంటి కోర్సులు పూర్తిచేసి దేశ విదేశాల్లో స్థిరపడి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను ఇస్తున్నారన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం అయ్యే పరిస్థితి దాపురించిందన్నారు.ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి యేటా 14 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని,కోర్సుల్లో ప్రవేశం పొందేటప్పుడే ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందన్న హామీ మేరకే విద్యార్థులు అడ్మిషన్ పొందుతారని,హామీ మేరకు ప్రవేశం పొందాక ఫీజు చెల్లించకుండా, 10000 కోట్ల రూపాయల రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను నయవంచనకు గురిచేస్తుందన్నారు.విద్య పై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి రాష్ట్ర,దేశ అభివృద్ధికి ఉపయోగపడే మానవవనరుల సృష్టి కోసమేనని, ఇదిఏమాత్రంఉచితపథకంకాదని,ఈవిషయాన్ని ప్రభుత్వం,సమాజం అర్థం చేసుకోవాలన్నారు.ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పేద విద్యార్థులకు విద్యాప్రదాయినిగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని BRS ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని,ఈ పథకాన్ని మా కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని,మేము అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లించడమే కాకుండా ఇంకా గొప్పగా అమలుచేస్తామని హామీ ఇచ్చారని,తీర అధికారం లోకి వచ్చాక స్వయంగా తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఎత్తివేతకు కుట్రలు చేస్తున్నారన్నారు.నా దగ్గర పంచడానికి భూములు లేవు,కానీ జీవితాన్ని నిలబెట్టే విద్యను మాత్రం అందిస్తానని పదే పదే వల్లే వేసే రేవంత్ రెడ్డి ఎందుకు పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థులతో గెలుక్కున్న ఏ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలువలేదని,నీ ప్రభుత్వానికి కూడా రోజులు దగ్గర పడ్డాయని,నీ ప్రభుత్వ మెడలు వంచైనా సరే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని కాపాడుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి పృథ్వితేజ, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిలు అలివేలు రాజు మరియు మహేష్, విద్యానగర్ విభాక్ కన్వీనర్ హరిప్రసాద్, స్టేట్ యూనివర్సిటీస్ కోకన్వీనర్ గంధం నరేందర్,ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు గెల్లు శేఖర్, కార్యదర్శి మోక్షిత్, తన్మై, జశ్వంత్, శ్రీకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే

❖ చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయులు పూలే

❖ ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది

దశ సూర్యాపేట ప్రతినిధి : బడుగు బలహీన ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది లు అన్నారు. శనివారం జిల్లాకేంద్రం ఎంజి రోడ్డు సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అడుగుజాడలే స్ఫూర్తిగా పయనించాలని పేర్కొన్నారు. మహిళలు చదువుకుంటే వారి కుటుంబము బాగుంటుందని, సమాజం, దేశం బాగుంటుందని, అప్పటిలోనే స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ఓ ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. అంతేకాకుండా వారి శ్రీమతి అయినటువంటి సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి, వారిని ఆ పాఠశాలలో ఉపాధ్యాయ రాలినిగా చేసిన మహానీయుడని అన్నారు. ఈ భారతదేశంలో మహాత్మా అని ఇద్దరినీ అంటారని, ఒకడు మహాత్మా గాంధీ అయితే మరొకరు మహాత్మ జ్యోతిబా పూలే మాత్రమే అని సామాజిక సంస్కరణలు, మానవ హక్కులు, సమ సమాజ స్థాపన, మహిళల విద్యాభివృద్ధికి నాంది పలికిన మహాత్ముడని అన్నారు.వారి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనపై ఉందని తెలిపారు.

అర్ధరాత్రి ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న..

అంతరాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

❖ వెయ్య లీటర్ల డీజిల్, రెండు డీసీఎంలు, ఆరు మొబైల్ ఫోన్లు, వడ్ల పట్టాలు స్వాధీనం

దశ నల్గొండ : అర్ధరాత్రి ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి 1000 లీటర్ల డీజిల్, రెండు DCM వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, వడ్ల పట్టాలు (సుమారు రూ.40 లక్షల విలువ) ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ముడావత్ గాంధీ నాయక్(36), ముడావత్ వెంకటేశ్వర్లు నాయక్(45), బనావత్ తుల్స్య నాయక్(21), ముడావత్ బాలకృష్ణ నాయక్(32), రామవత్ వాగ్య నాయక్(45), మరో మైనర్ బాలుడి గుర్తించారు. వీరంతా ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన వారు. వీరంతా తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కేసు వివరాలను నల్లగొండ జిల్లా అదనపు ఎస్పీ జి.రమేశ్ శనివారం వెల్లడించారు.నల్లగొండ జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, ఇతర హైవేలపై రాత్రి సమయంలో ఆగి ఉన్న లారీలు,ట్రక్కులు, ఇతర భారీ వాహనాల నుండి వరుసగా డీజిల్ దొంగతనాలు జరుగుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి హైవేలు, అనుమానాస్పద ప్రాంతాల్లో గస్తీ పెంచడం జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 10న రాత్రి సమయంలో చిట్యాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైవేపై అనుమానాస్పదంగా నిలిచి ఉన్న ఓ డీసీఎం వాహనాన్ని గమనించారు. తనిఖీ చేయగా వడ్ల పట్టాల చాటున డీజిల్ తో నిండిన క్యాన్లు దాచి పెట్టినట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ బాలకృష్ణ, ఇతరులను అదుపులోకి తీసుకుని విచారణ జరపగా హైవేపై ఆగి ఉన్న లారీల నుండి డీజిల్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు.

అలాగే తమ ముఠాకు చెందిన మరికొంత మంది సభ్యులు మరో డీసీఎం వాహనంతో కొంత దూరంలో ఉన్నట్లు సమాచారం ఇవ్వగా దీనిపై వెంటనే స్పందించి ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టి రెండో డీసీఎం వాహనాన్ని కూడా పోలీసులు గుర్తించారు. దానిలో మిగతా డీజిల్, మొత్తం ఆరుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్పీ వెల్లడించారు. డీజిల్ దొంగల ముఠాను నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన నల్లగొండ సి.సి.ఎస్ ఇన్స్పెక్టర్లు ఎమ్.జితేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చిట్యాల సీఐ నాగరాజు, చిట్యాల ఎస్.ఐ రవి కుమార్, సిసిఎస్ ఎస్ఐలు విజయ్ కుమార్, మధు, సతీష్ వర్మ, సి.సి.ఎస్ హెడ్ కానిస్టేబుల్స్ విష్ణువర్ధన గిరి, పుష్పగిరి, వహీద్ పాషా, శ్రీను, కానిస్టేబుల్స్, అసర్, దస్తాగిరి, సాయికుమార్, జూనేద్, శివరాజు, నరేశ్, సిసిఎస్ ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.



నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయబృందం విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు.-(దశ, నేరేడుచర్ల)

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు

దశ, ఓయూ: అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం..సమాజంలోకుల నిర్మూలన కోసం.. సమసమాజ స్థాపన కోసం.. విశేషంగా కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త..మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ టిడిపి అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్ లాలపేట కార్తీక్ పంక్షన్ హాల్ దగ్గర జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి మహనీయుని త్యాగాలను స్మరించుకుంటూ ఆ మహనీయుని దివ్య స్మృతికి ఘనంగా నివాళులు" అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు తడక వినోద్ కుమార్ , టిడిపి డివిజన్ ప్రధాన కార్యదర్శి GM రమేష్ ,నవీన్ , శ్రీనివాస్ ,గౌస్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

❖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ.

దశ, సూర్యాపేట ప్రతినిధి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు బౌషధ నియంత్రణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో "మాదకద్రవ్యాల నియంత్రణ మరియు నిబంధనల బలోపేత దినోత్సవం" యొక్క ర్యాలీని అంబేడ్కర్ విగ్రహం, ఖమ్మం క్రాస్ రోడ్ నుండి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా పెండెం వెంటరమణ ప్రారంభించి స్థానిక పద్మశాలి భవన్ వరకు నిర్వహించారు. అనంతరం పద్మశాలి భవన్ లో నిర్వహించిన అవగాహనా సమావేశంలో పాల్గొని ఏప్రిల్ 6 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు జరుపుకొనుచున్న ఆరోగ్య వారంలో అరోగ్య అవగాహనా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి సమాజాన్ని ఆరోగ్య విద్యా ప్రేరణ పెంపొందించామని ఆయన అన్నారు.

నేడు మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి, అవగాహన పెంచడానికి, నివారణ చర్యలను బలపరచడానికి అన్ని ప్రభుత్వ శాఖలు, సమాజం తమ వంతు కృషి చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్జ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అందువల్ల కుటుంబం, సమాజంపై ప్రభావం చూపుతున్నదన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులని, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి, సైకియటిస్ట్ డా వివాసవన్, పట్టణ సి.ఐ వెంకన్న, వికాస్ కాలేజ్ ప్రిన్సిపాల్ రమేశ్, డెమో సంజీవ్ రెడ్డి, జిల్లా కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యమ ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు పెండెం విజయ్, ఫార్మాసూటికల్స్ అధ్యక్షుడు ముషమ్ హరి, కృష్ణమూర్తి, ఉపేందర్, శ్రీనివాస్ రెడ్డి మరియు ప్రభుత్వ పారమెడికల్ కళాశాల వందన, చందన, తిరుమల, నిర్మల కళాశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.